# అంత్యన్యాయతీర్పు(1836)

## (బళ్ళారి కరపత్రము)

ఓ జనులారా, యీ లోకమందు మనపూర్వీకులు పుట్టి చనిపోయినారు. మనమున్ను పుట్టి యున్నాము. వొకదినము చని పోదుము. యీలాగే లోకముకలిగినది మొదలుకొని మనుష్యులు క్రమక్రమముగా పుట్టి కొద్దికాలమండి తర్వాత చనిపోవుచున్నారు. యీ ప్రకారముగానే యెన్నటికిన్ని ఉండునాయని అడిగితే యెన్నటికిన్ని యీ రీతిగానే యుండదు. మఱియొక కాలములో మనష్యులు పుట్టేదిన్ని, చనిపోయ్యేదిన్ని లేదు. అయితే లోకము కలిగినది మొదలుకొని చనిపోయినవారులయొక్క ఆత్మలు మరల తమశరీరములతో అయిక్యమై సకలలోకములను యేలే కర్తయైన యేసుక్రీస్తుని సముఖమునకు వచ్చి అతని చేత న్యాయతీర్పును పొంది కొందరు మోక్ష రాజ్యములోనున్ను , కొందరు నరకములోనున్ను ప్రవేశించి అచ్చటచ్చట పుట్టడమున్ను, చావటమున్ను లేకుండా యెన్నటికిన్ని యుందురు. యీలాగు చనిపోయినవారు తిరుగా బ్రతికి కర్తని వల్ల న్యాయతీర్పును పొందే దినము అంత్యదివసమని సత్యవాక్యము చెప్పుచున్నది. ఆ యంత్య దినములో మీకు వేదన కలగకుండా నిత్యసంతోషము కలిగేటందుకు సత్యవాక్యమును బోధించే నేను యీ కార్యమును గూర్చి మీకు వ్రాసి బుద్ధి చెప్పుడమునకు యిచ్చయించినాను. యిది స్వల్పమైన కార్యము కాదు. మిక్కిలి శ్రేష్ఠమైన కార్యముగానున్నది. గనుక మీరు దాన్ని గొప్పగా నెంచుకొనుడి. జనులు రాజుకు ద్రోహము చేసిన పిమ్మట ఆ ద్రోహము కొరకు అతడు దండించునో, క్షమించునోయని చింతించకుండా అజాగ్రత్తగానుండరు. ఆ ప్రకారమే మీరున్ను సర్వలో కరాజైన కర్త అంత్యదినమందు మనల మోక్షరాజ్యములో చేర్చుకొనునో నరకములో తోసివేసునోయని చింతించకుండా అజాగ్రత్తగా నుండగూడదు. గనుక

ఆయన యెహూదైయా దేశపు వారిలో మనుష్యావతారమునెత్తి పాపులకు వుపదేశమును చేసి వచ్చేటప్పుడు అంత్యదినమును గురించి ఆనతిచ్చిన వచనములను మీరు బాగా తలంచు కొనుడి ఆయన ఆనతిచ్చిన దేమంటే మనిషియొక్క కుమారుడు తన మహిమయందు తన పరిశుద్ధమైన సకలదూతలతో కూడా వచ్చిన సమయమందు తన మహిమగల సింహాసనమం దాసీనుడౌను. ఆ సమయమును సమస్త జనులు అతని ముందర కూర్చబడుదురు అప్పుడు మేపేవాడు గొఱ్ఱెలనున్ను, మేకలనున్ను విభజన చేసేటట్టు ఆయన వారిని విభజన చేసి గొఱ్ఱెలను తన కుడిపార్శ్వమందున్ను, మేకలను తన యెడమపార్శ్వమందు న్నుంచును . తర్వాత రాజైనవాడు తన కుడిపార్శ్వమందున్న వారిని చూచి చెప్పేదేమంటే నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా రండి లోకారంభమైనప్పటి నుంచి మీకాయత్తమైన రాజ్యమును స్వతంత్రించుకొనుడీ, యెందుకంటే నేను ఆకలిగొని యుంటిని మీరు నాకు భోజనమునకిచ్చితిరి, దాహముగొనియుంటిని నాకు తాగనిచ్చితిరి, పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి, దిగంబరి గానుంటిని నాకు కట్టనిచ్చితిరి, వ్యాధితోనుంటిని నన్ను పరామర్శించితిరి, చెఱలో నుంటిని నావద్దికి వచ్చితిరని చెప్పును. అప్పుడు నీతివంతులతనికి ప్రత్యుత్తరముగా చెప్పేదేమంటే ఓ కర్తా నిన్ను యెప్పుడు ఆకలిగొన్నవానిగాజూచి అన్నముపెట్టితిని లేక దాహము గొన్నవానిగాజూచి తాగనిచ్చితిమి నిన్ను యెప్పుడు పరదేశియైనవాని గాజూచి చేర్చుకొంటిమి లేక దిగంబరునిగాజూచి కట్టనిచ్చితిమి నిన్ను యెప్పుడు వ్యాధిగల వానిగా లేక చెఱలో నున్నవానిగాజూచి నీవద్దికి వచ్చితిమని చెప్పుదురు. అందుకు రాజైనవాడు వారిని చూచి నేను మీకు నిజముగా చెప్పేదేమంటే నా సహోదరులనే వీరిలో నుండే స్వల్పమైన వొకనికి దీన్ని మీరు చేసినందున అది నాకు చేసినట్టాయ్యనని ప్రత్యుత్తరము చెప్పును. తర్వాత యెడమ పార్శ్వముననుండే వారిని చూచి చెప్పేదేమంటే శాపమునకు లోనైనవారలారా నన్ను విడిచి పిశాచికిన్ని, దాని యొక్క దూతలకున్ను ఆయత్తమైన నిత్యాగ్నిలోకిపొండి, యెందుకంటే నేను

ఆకలిగొనియుంటిని నాకు మీరు అన్నము పెట్టినవారు కారు దాహము గొని యుంటిని నాకుమీరు తాగనిచ్చినవారు కారు పరదేశినైయుంటిని మీరు నన్ను చేర్చుకొన్నవారు కారు, దిగంబరిగానుంటిని నాకు మీరు కట్టనిచ్చినవారు కారు వ్యాధిలోనున్ను చెఱలోన్ను వుంటిని నన్ను మీరు పరామర్శించినవారు కాదని చెప్పును. వీరు ప్రత్యుత్తరముగా చెప్పేదేమిటంటే ఓ కర్తా మేము నిన్నెప్పుడు ఆకలిగానున్ను, దాహముగా నున్ను, పరదేశీగానున్ను, దిగంబరిగానున్ను, వ్యాధిలోనున్ను, చెఱలోనుండేవానిగానున్ను చూచి నీకు సేవచెయ్యకుండా నుంటిమని పలుకుదురు. అప్పుడాయన వారిని చూచి నేను మీకునిజముగా చెప్పేదే మంటే వీరిలో నుండె స్వల్పుడైన వొకనికి దీన్ని చేయక నుండినందున యిది నాకు చేయనట్లాయనని చెప్పును. అప్పుడు వీరు నిత్య యాతనకున్ను, నీతివంతులు నిత్యజీవమున కున్ను వెళ్లుదురని చెప్పెను.

ఈ చరిత్రలో మనిషియొక్క కుమారుడనిన్ని, రాజనిన్ని చెప్పియున్నవాడు యేసుక్రీస్తేను. ఆయన వొక స్త్రీ యందు మనుష్యా వతారమును చేసినందువల్ల తన్ను మనిషి యొక్క కుమారుడని చెప్పినాడు. ఆయన శ్రమబడి మరణమును పొందినందువల్ల పాపుల యొక్క ఆత్మరక్షణ్యమును కలగజేసి తిరిగి జీవముతోలేచి పరమండలమందున్ను, భూమండలమందున్ను సకల అధికారము గలవాడు గా నున్నందువల్ల ఆయన తాను రాజని చెప్పబడెను. కాబట్టి అతనికి లోబడి నడువుడి. మఱిన్ని యీ చరిత్రలో చెప్పియున్న ప్రకారమే సకల జనులు ఆయన ముందర కూర్చబడి అతని చేత న్యాయతీర్పును పొందుదురు. గనుక మీరున్ను అతని నమ్మినప్పటికిన్ని నమ్మకపోయినప్పటికిన్ని యీరీతిగానే యిక మీదట అతనిముందర చేరి అతని చేత న్యాయతీర్పును పొందుదురు. దీన్ని చక్కగా గ్రహించుకొనుండీ. యిది గాక అతని విషయమై ధర్మములను చేసిన వారికి నిత్యజీవము నిచ్చునని చెప్పియున్నది. ఆయన పరమండలములో సకల సంపూర్ణమైన మహిమగల వాడుగా నుండే

టప్పుడు మన ధర్మములను అతనికి యేలాగు యివ్వవ చ్చునంటే యీలోకములో అతని శిష్యులకు మీరు అతని నిమిత్తము యేమి చేతురో అది మీరు అతనికి చేసినట్టుండును. తన్ను విశ్వసించి వెంబడించేవారి మీద నిండుదయ నుంచి వారిని తన యొక్క సహోదరులని చెప్పును. గనుక మీ ధర్మములను మీరు అతని నిమిత్తము చెయ్యవలసినది. అదెట్లానంటే కర్తయైన యేసుక్రీస్తు పాపులైన మనకొరకు యీ లోకమునకు వచ్చి శ్రమబడి మరణమును పొంది తన దివ్యరక్తమును చింది మనకొరకు మోక్షస్థల మును సిద్ధము చేసినందువల్ల మనము ఆయనకు నిత్యస్తోత్రమును చెల్లించి అతని యందు భక్తినుంచి యేరీతినైనా అతని యాజ్ఞల ప్రకారము చెయ్యడము మనకు తగినది. కాబట్టి ధర్మమును చేసేటందుకు ఆయనాజ్ఞాపించినందువల్ల మనము యితరులకు మనవల్ల నైనమట్టుకు మేలు చెయ్యవలెనని మీరు తలంచుకొని స్నేహితులకైనానున్ను, శత్రువులకైనానున్ను, యెవరికిన్ని అతని నిమిత్తము మేలు చేసితే అది మీరు అతనికే చేసినట్టుండును. యీ రీతిగా మీరు అతనికి మేలు చేసితే ఆయన మీకు నిత్యసంతోషమును కలుగజేసుననేదిగా నేలాగు చెప్పుదువంటే నా తండ్రి చేత ఆశీర్వదింప బడిన వారలారా లోకము గలిగిన మొదటి నుంచి మీ కొరకు సిద్ధము చెయ్యబడిన రాజ్యమును స్వతంత్రించు కొనేటందుకై రండని చెప్పి మిమ్ము మోక్షరాజ్యమందు చేర్చుకొనును. మోక్షరాజ్యమును స్వతంత్రిచుకొనేటందుకు మన ధర్మములే ఆది కారణముగా నుండునని మీరు తలంచకూడదు. యెందుచేతనంటే మనము యెన్ని మేలులను చేసినప్పటికిన్ని లోకమందుండే పర్యంతము మనము తప్పులేనివారుగానున్ను దేవుని యెదుట నిండు పరి శుద్ధముగల వారుగా నున్నుండెదము. ఇదిన్ని గాక యేసుక్రీస్తు కొరకు ధర్మములను చేసే గుణము అతని విశ్వసించే విశ్వాసముచేత పుట్టేదే గాని వేరేవిధముగా మనలో పుట్టదుగనుక మనము మోక్షమునుపొందేటందుకు మన ధర్మములు ఆది కారణమని చెప్పకూడదు. యేసుక్రీస్తు మన పాపములను పరిహరించేటందుకై చిందిన తన శ్రేష్ఠమైన రక్తమున్ను, పొందిన

మరణమున్ను దానికి ఆది కారణములుగానున్నవి. దాన్ని మనము విశ్వసించుకొంటే మన పాపములు క్షమించ పడేదిన్ని గాక ఆలాటి ధర్మములను చేసేటందుకైన గుణమున్ను కలుగును. ఆలాగైతే మనము చేసిన ధర్మములకొరకు మీకు మోక్షరాజ్యమునిత్తునని యేసుక్రీస్తు యెందుకు చెప్పునంటే మనము అతని నిమిత్తము చేసిన ధర్మములు అతని బట్టే విశ్వాసమునకు దృష్టాంతములైనందువల్లనున్ను ఆలాటి ధర్మములను మనము చేసేటందుకైన గుణము మనము మోక్ష రాజ్యములో గలవారితో కూడా నుండుటకు మనల తగినవారలుగా చేసేటందు వల్లనున్ను ఆయన ఆరీతిగానే చెప్పును. యేసు చేసిన పాపనివృత్తి మనరక్షిణ్యమునకు ఆది కారణముగా నుండును. అతని నిమిత్తము ధర్మములను చేసే గుణము దానిచేత పుట్టి మోక్షరాజ్య ములోనుండుటకు మనల తగిన వారినిగా చేయుచున్నది. అటువంటి గుణము లేకుండా మనకు మోక్షమనుభవించ శక్తియుండదు. కాబట్టి అతని నిమిత్తము ధర్మములను చేసే వారిని ఆయన చూచి మోక్ష రాజ్యమును స్వతంత్రించుకొనుటకు రండని చెప్పును. యేసుక్రీస్తు యొక్క తండ్రి యైన దేవుడు పాపములోనుంచి మనల రక్షించేటందుకు తన యొక్క కుమారున్ని యీ లోకమునకు పంపించి మనకొరకు మరణమునకు వొప్పగించి అంతమాత్రం మనయందు ప్రీతి నుంచినాడు. యిదిగాక యేసుక్రీస్తు మనల రక్షించేటందుకు కావలసినదాన్ని చేసిన తర్వాత పరమతండ్రి తన ఆత్మచేత మనుష్యులకు ఆతని గూర్చి భోదించి అతని విశ్వసించేటట్టు చేయుచున్నాడు. ఆలాగు, తనివల్ల నేర్చుకొని శాంతగుణము గల గొఱ్ఱెల వలెనే అతనికి విరోధము చెయ్యకుండా యేసు క్రీస్తును, తమ రక్షకుండని అంగీకరించుకొని ఆయనయందు భక్తి గలిగి అతణ్ని పట్టేవారికి పరమతండ్రి వారి పాపములను మన్నించి నిత్య జీవమును పొందేటందుకు వారిని యేర్పఱచును. యీ రీతిగా వారు యేసుక్రీస్తు యొక్క తండ్రి చేత ఆశీర్వదించబడినవారౌచున్నారు. యేసుక్రీస్తు ఆలాటివారికి మోక్షరాజ్యము లో వొక స్థలము నిచ్చేటందుకు దేవుడు అది మొదలుకొని చిత్తముగా

నున్నాడు. గనుక అది లోకము కలిగినది మొదలుకొని వారికి సిద్ధము చెయ్యబడి యున్నదని చెప్పినాడు. ఆలాటి నీతివంతులైన వారు యికను పాసమున్ను, వ్యాధిన్ని, బలహీనమున్ను, దుఃఖమున్ను, కష్టమున్ను, మరణమున్ను, లేకుండా పరిశుద్ధత్వము సంతోషము బలము మొదలైన మహిమగలవారై నిత్య జీవముననుభవింతురు. పరమతండ్రి బోధించిన్ని ఆయనవల్ల నేర్చుకొనకనున్ను యేసుక్రీస్తును తమరక్షకుండని విశ్వాసముతో అంగీకరించకనున్ను వొంగిన మెడగల మేకలవలెనే అతని బోధను విరోధించి విసర్జించి తమ వ్యర్ధమైన చెడ్డయిచ్ఛలచొప్పున నడిచిన వారితో, ఆయన శపించబడినవారలారా మీరు నన్ను, విడచి పిశాచి కొరకున్ను, దాని యొక్క దూతలకొరకున్ను ఆయత్తము చెయ్యబడియున్న నిత్యాగ్నికి పొందని చెప్పును. వారుదేవుని యొక్క దయగలకట్టడలను మీరి పిశాచిమర్మములో నడిచినందువల్ల దేవుడు తన పరిశుద్ధ సన్నిధానమందు నుంచక వారిని తోసి పిశాచికిన్ని దాని దూతలకున్ను నివాసమైన నరకమును యేర్పఱచినాడు. గనుక వారిని శపించ బడినవారని చెప్పినాడు. యీ రీతిగా వారు యే సంతోషమున్ను నిమ్మళమున్ను లేకుండా దుఃఖము వేదనా మొదలైన కఠిన శ్రమలు కలిగి నిత్యాగ్నిని పొందుదురు. వారు యీ లోకమందుండినప్పుడు యేలాటి ధర్మములనున్ను చెయ్యనివారని మీరు తలంచకూడదు. వారిలో అనేకులు బాటసారుల కొరకు చలివేంద్రములను వుంచి అన్నము, రూకలు మొదలైన వాటిని దరిద్రులకిచ్చిన వారుగానుందురు. అయితే వారు తమకు స్తుతి, కీర్తి, పాపక్షమ, మోక్షము మొదలైనవి పొందేటట్టు ఆ మేలులను ఆహంకృతిగా చేసినారు గాని కర్తుడైన యేసుక్రీస్తు మీద భక్తిగలిగి అతని నిమిత్తము వాట్లను చెయ్యలేదు అయినందువల్ల అవి కర్తునియెదుట వ్యర్ధముగా నున్నవి. యిదిగాక వారు వాట్లను పరిశుద్ధములేని మనస్సుతో చేసి నానావిధములైన దుర్మార్గములతో ప్రవర్తించినందువల్ల వారుయెన్ని ధర్మములను చేసినప్పటికిన్ని కర్తునికి ప్రియముగల వారుగానుండరు.

కాబట్టి యేసుక్రీస్తు చరిత్రలో చెప్పే ధర్మములు వ్యర్థమైన మనస్సుతో చెయ్యబడిన ధర్మములు కావు. అతని విశ్వసించే విశ్వాసమున్ను భక్తిగల మనస్సుతో చెయ్యబడిన ధర్మములుగానే యున్నవి వ్యర్థమైన మనస్సుతో ధర్మములను చేసిన వారికి సంతోషము రానేరదు. తమ పాపములను తెలుసుకొని పశ్చాతప్తులై యేసుక్రీస్తును విశ్వసించి అతని యందు భక్తి నుంచి అతనికి ప్రియముగా నడవ నిచ్ఛయించే మనస్సుతో ధర్మములను చేసేవారికే మిక్కిలి సంతోషము వచ్చును. ఓ జనులారా యికమీదట మనకు న్యాయమును తీర్పు చేసేవాడైన కర్త తానేమనకు యీలాగు బోధించియున్నాడు. గనుక అది యబద్ధమని వొకడున్ను చెప్పకూడదు. యీలాగు నిజముగా సంభవించును. శపించబడిన వారలారా నన్ను విడిచి నిత్యాగ్నికి పొందని ఆయన అంత్య దివసమందు మీతో చెప్పకుండా నా తండ్రి చేత నాశీర్వదింపబడిన వారలారా మోక్షరాజ్యమును స్వతంత్రించుకొనుటకు రండని ఆయన మీతో చెప్పిమిమ్ము నిత్య భాగ్యవంతులుగా జేసేటందుకు మీరువ్యర్థమైన మనస్సుతో ధర్మములను చేయకుండా అతని నిమిత్తమే ధర్మములను చేయుడీ. యిది గాక మీరతని నిమిత్తమే ధర్మములను చేసేటందుకు అతని యందు భక్తి నుంచి అతని విశ్వసించేటందుకు మీరు మీ పాపమైన గుణములను తెలుసుకొని దేవునికి చేసిన ద్రోహములను వినయముతో మీరు వొప్పుకొని క్రీస్తువచ్చి మన కొరకు శ్రమబడి మరణమునుపొందిన దాన్ని నమ్మి అతన్ని మీ రక్షకుడని విశ్వసించి యీ రీతిగా దుర్మార్గమును విడిచి సన్మార్గములో నడిచి గుణవంతులౌదురుగాక. ఆలాగు గుణవంతులయ్యేటందుకు మీరు దేవుడానతిచ్చిన వాక్యమునున్ను దానిలో యేసుక్రీస్తునుగూర్చి ముఖ్యముగా చెప్పియున్న వుదేశములనున్ను నేర్చుకొని అతని మార్గములో నడువుడీ. ఈలాగు మీరు చేసేటందుకు దేవుడు మీకు తనయాత్మనిచ్చి యీలాటి ఘనమైన న్యాయములను మీ బుద్ధికి బయలు పఱచి మీకు పరిశుద్ధ గుణమునిచ్చి మీరు యిక మీదట నిత్యాగ్నిని అనుభవించక నిత్యజీవమైన మోక్షమునే అనుభవించేటందుకు ఆయన మీకు అనుగ్రహము చేయునుగాక.